



మాట్లాడుతున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలెప్పుడో?

- అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ
- పక్కా భవనాలు లేక ఇబ్బందులు
- ఇరుకు గదులు..అవస్థల్లో విద్యార్థులు
- మౌలిక వసతుల లేమితో అంగన్వాడీ విద్య నిర్వీర్యం
- ప్రభుత్వ పనులు ఎక్కువ..చదువు తక్కువ
- పట్టని అధికారులు



రాయచోటిలో అద్దెభవనంలో అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలంటే చిన్నపిల్లలకు విద్య నేర్పించే అమ్మబడి లాంటిది. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను చెబుతారు. అంగన్వాడీ టీచర్లు వారిని మెప్పించి రప్పించే విధంగా విద్యా బోధన కొనసాగుతూ ఉంటుంది. ప్రభుత్వం వీరికి పౌష్టికాహారంతో పాటు పాలు,కోడి గుడ్లు, గర్భిణులకు వైద్య పరీక్షలు, గర్భిణుల నమోదు, వారికి రోజూ పౌష్టికాహారం అందిస్తూ ఉంటారు. ప్రస్తుతం జిల్లాలో చాలా వరకు అంగన్వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లాలో 2,275 అంగనవాడీ కేంద్రాలున్నాయి. మెయిన్ 18,58, మినీ 417, మొత్తం 2,275 ఉన్నాయి. మెయిన్ 937 సొంతభవనాల్లో, 611 అద్దె భవనాల్లో, 310 అద్దె లేకుండా మొత్తం 1,858 ఉన్నాయి. 93 మినీ సొంత భవనాలు 186 అద్దె, 138 అద్దె లేకుండా, మొత్తం 417 భవనాలున్నాయి. అలాంటి కేంద్రాల్లో ఏ ప్రభుత్వం వచ్చినా కూడా ప్రభుత్వం అనేక రకాల పని, ఒత్తిళ్ల వల్ల అంగన్వాడీ కార్యకర్తలు సతమతమవుతున్నారు. విద్యా బోధన కంటే ఇతర పనుల వల్ల చిన్నారుల విద్యా బోధన కుంటుపడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు చక్కటి విద్యా బోధన అందించి వారికి పాఠశాలకు వెళ్లేల్లా సంసిద్ధులను చేస్తారు. జిల్లాలో చాలా ప్రాంతాలలో అంగన్వాడీకేంద్రాలకు సొంత భవనాలు తక్కువగా ఉన్నాయి. మిగిలినవి అద్దెభవనాల్లో చాలీచాలని వసతుల నడుమ కొనసాగుతున్నాయి. ప్రస్తుతం భవనాలకు అద్దె కూడా సక్రమంగా చెల్లించకుండా ఉండటంతో యజమానులు భవనాలు ఖాళీ చేయాలంటూ కార్యకర్తలను బెదిరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీల పరిస్థితి దయనీయంగా ఉంది. అంగన్వాడీలకు రావాల్సిన వేతనాలు సక్రమంగా అందకపోవడం, నిర్వహణ ఖర్చుల బిల్లులు కూడా అందకపోవడంతో అప్పులు చేసి కేంద్రాలను నడిస్తున్నారు. అప్పోసొప్పో చేసి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నామని, అయినా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని వాపోయారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కచ్చితంగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. చిన్న భవనాలకు ఇలాంటి సౌకర్యాలు ఉండడం చాలా అరుదు. చాలాచోట్ల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యాలయాల్లోని వారు చూపించిన స్థలంలో వారి ఆధీనంలో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల అయితే శిథిలావస్థలో ఉన్న భవనాలలో అంగన్వాడీ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్నారు. అక్కడ ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందో భయం భయంగా వారు విద్యాబోధన సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద కొన్ని గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలను నిర్మించారు. అవి కూడా చాలా చోట్ల సకాలంలో బిల్లులు అంద కపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఇప్పటివరకు అంగన్వాడీ కేంద్రాలకు భవన నిర్మాణాల కోసం ఎటువంటి బడ్జెట్ కేటాయించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా సొంత అంగన్వాడి భవన నిర్మాణాలను కేంద్రాలను ఏర్పాటు చేయాలని గర్భిణులు, తల్లిదండ్రులు, అంగన్వాడీలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

జిల్లాలో అద్దె భవనాలలో అంగన్వాడీ కేంద్రాలు అధికంగా నడుస్తున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినా అంగన్వాడీ కార్యకర్త కష్టాలు తీరడం లేదు. కొన్ని కేంద్రాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో అద్దె భవనాలకు బాడుగలు పెరిగిపోయాయి. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.



- పి. సరస్వతి, అంగన్వావాడీ కార్యకర్త, రాయచోటి.

నూతన భవనాలు మంజూరు చేయాలి

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ పాఠశాలలు ప్రభుత్వ భవనాలలో ఉండాలి. అందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి దశల వారిగా పూర్తి చేసి అంగన్వాడీల పై అద్దె భారాలకు స్వస్తి చెప్పాలి. గత ప్రభుత్వంలో అంగనవాడీ భవనాలకు పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలి. పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూడా వెంటనే చెల్లించి నిర్మాణం పూర్తి చేయించాలి. కూటమి ప్రభుత్వం నూతన భవనాలను మంజూరు చేయాలి.



- ఎ.రామాంజులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి.

కార్మిక హక్కులను కాపాడుకుందాం

- వామపక్ష కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కార్మిక ద్రోహన్ని తిప్పి కొట్టి, లేబర్ కోడ్స్ రద్ద య్యేంత వరకూ ఐక్య పోరాటాలతో కార్మిక హక్కులు చట్టాలు రక్షించుకుందామని సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎ.రామాంజులు, ఎం.సాంబశివ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బిజెపి కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని, ఆ మార్పులను వెంటనే ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాట సాధించిన 29 చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా పెట్టుబడి దారులకు అనుకూలంగా మార్చారని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచటం, రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటలను 10 గంటలకు పెంచడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలు పెంచాలని కార్మికులు స్కీం వర్కర్లు కోరుతూ ఉంటే పెంచకపోగా కార్మికుల పని గంటలు పెంచడంతో, వేతనాలు తగ్గిపో యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాలుగా షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు వేతనాలు సవరించలేదని, కార్మిక సంక్షేమ బోర్డుకు చైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదని పేర్కొన్నారు. పని గంటలు 8 గంటలను 10 గంటలకు పెంచటం, మహిళా కార్మికులతో పని చేయించు కునేవిధంగా మార్పు చేయటం, ఓవర్ టైంను పెంచటం వంటి మార్పులను కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని విమర్శించారు. ఇప్పటికే మహిళలపై లైంగిక వేధిం పులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, అలాంటిది రాత్రిపూట పనులు చేయిస్తే మహిళలకు రక్షణ ఎలా ఉంటుం దని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్స్‌కు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు కార్మిక సంఘాలకు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాల చర్యల వల్ల పిఎఫ్, ఇఎస్ఐ గ్రాడ్యుటీ, నిర్వీర్యం అవుతుంద న్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి ఇప్పుడు పెట్టుబడిదారులకు అనుకూల విధనాలు అనుసరిస్తున్నారని విమర్శిం చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్య క్షులు ఎ.వి.రమణ, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, మున్సిపల్ యూనియన్ టౌన్ కమిటీ అధ్యక్షులు ఎం.చెన్నయ్య, వంగిమళ్ళ రంగారెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు, ఎఐటి యుసి జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాషా పాల్గొన్నారు.

చిట్వేలు: కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. ఎంఇఒ ఆఫీస్ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి పెద్ద కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమ దోపిడీని దోచుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు పంది కాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సిఐటియు నాయకులు సుజాత, వెంకటరమణ, రంగారెడ్డి, సుధాకర్ ఖాదరవల్లి, శ్రీనివాసులు, బొమ్మ సుబ్బరాయుడు, నాగరత్నమ్మ సుప్రత్నమ్మ, గంగాదేవి, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం, నరసింహులు పాల్గొన్నారు.



అరగుండు, అర మీసంతో నిరసన తెలుపుతున్న బుద్ధిష్టులు

అరగుండుతో నిరసన..భగ్నానికి పోలీసుల యత్నం


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బుద్ధుడి కొండపై గుర్తుతెలియని దుండగులు బుద్ధుడి తల నరికినందుకు నిరసనగా బుద్ధ సభ్యులు శుక్రవారం అరగుండు, అర మీసంతో వినూత్నరీతిలో శాంతియుత నిరసన దీక్ష చేశారు. ఈ నిరసన దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు భగ్నం చేసేందుకు ప్రయత్నం చేశారు. సుమారు 30 మందికి పైగా పోలీసులు నిరసన దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. నిరసనను విరమింపచేయాలని, అనుమతి లేకుండా చేయడం తగదని వన్ టౌన్ సిఐ ఎరిసావల్లి, టూటౌన్ సిఐ రామచంద్ర, ఎస్ఐలు శివారెడ్డి, అన్సర్‌బాష, రహీముల్లా బుద్ధిష్టులకు చెప్పారు. తాము శాంతియుతంగా నిరసన దీక్ష చేపట్టామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని, రోడ్డు బయటనే తమ ఆవేదనను వెలిబుచ్చుతున్నామని, తామేమి పరాయి దేశస్తులం కాదని, ఉగ్రవాదులంకామని చెప్పారు. తమకు న్యాయం జరకపోవడంతో తాముకు తామే శిక్షించుకుని అర గుండు, అర మీసం చేసుకొని తమ బాధను విన్నవిస్తున్నామన్నారు. పోలీసులు దీక్షను భగ్నం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయగా, బాస్ నేతలు, బుద్ధ సమాజ్ సభ్యులు పోలీసుల వైఖరిని నిరసించారు. పోలీసులు డౌన్.. డౌన్.. అంటూ నినదించారు. వెనక్కి తగ్గిన పోలీసులు దీక్ష ముగింపు సమయం వరకు వేచి ఉన్నారు. ఈ సందర్భంగా బుద్ధ సమాజ్ ట్రస్టీ పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ తాలూకా సిఐ కళా వెంకట్రమణ బిజెపి, ఆర్ఎస్ఎస్ సభ్యులతో బేరం మాట్లాడుకుని బుద్ధిని కొండలో బుద్ధుని తలను నరికించారని తీవ్ర ఆరోపణలు చేశారు. తాము బుద్ధుని కొండను అష్ట కష్టాలు పడి అభివృద్ధి చేస్తే సంబంధంలేని విఆర్ఒ వద్ద స్టేట్మెంట్ ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. నిరసన దీక్షలో బాస్ నేతలు ముత్యాల మోహన్, చాట్ల బయన్న, తలారి కృష్ణ, రవిశంకర్, రెడ్డిప్రసాద్, గంగాధర్, పీర్ సాబ్, తెట్టు శ్రీనివాసులు, నీరుగట్టు రమణ పాల్గొన్నారు. **పీలేరు:** బుద్ధుని కొండలో బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పీలేరు బాస్ కార్యాలయంలో ఆయన బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేషా వలితో కలసి మీడియాతో మాట్లాడుతూ బుద్ధుడి విగ్రహాలపై ఇలా పలుమార్లు దాడులకు పాల్పడుతున్న ఉన్మాదులను వెంటనే గుర్తించి, అరెస్టు చేయాలని కూడా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాస్ నాయ కులు ఆరుమడకల నాగరాజ, గుండ్లూరు రవీంద్ర, పల్లిపోగు హరినాధ, ముల్లంగి గురవయ్య, ఆటో యూనియన్ నాయకులు నంద్యాల రామచంద్ర, హరి ప్రసాద్, షేక్ సలీమ్, చింతపర్తి భాస్కర్ పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థులకు పరామర్శ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకుచిన్నమండెం మండలం బోనుమల ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులపై దాడి ఘటనకు సంబంధించి విచారణ నిమిత్తం డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ నరసయ్య సంఘటన స్థలంకు శుక్రవారం వెళ్ళి విద్యార్థులను పరామర్శించి వారి తల్లితండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై దాడి ఘటనలో ఎలాంటి ఆరోగ్య పరమైన సమస్యలు లేవని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే చిన్నమండెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వెంటనే వెళ్లి తగు చికిత్స చేసారని పేర్కొన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యుల పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌లు, సూపర్ వైజర్‌లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అబ్దుల్ హకీమ్ పాల్గొన్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ నరసయ్య

రాయచోటిలో భారీగా పోలీసుల మోహరింపు

- ప్రధాన కూడళ్లల్లో భారీ భద్రత
- పోలీసుల అదుపులో ఉగ్రవాదులకు ఇళ్లు ఇచ్చిన యజమానులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పట్టణంలో ఉగ్రవాదుల అరెస్టుతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలలో భాగంగా పోలీసు బలగాలు రాయచోటిలో భారీగా మోహరించాయి. రాయచోటి సబ్ డివిజన్‌తో పాటు మదనపల్లి, రాజంపేట డివిజన్‌ల నుండి పోలీసు బలగాలు భారీగా రాయచోటి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నాయి. ప్రత్యేక పోలీసు బలగాల తోపాటు డాగ్ స్క్వాడ్ బృందాలను సైతం రప్పించారు. రాయచోటి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ఉగ్రవాదుల ఇళ్ల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ఈ పోలీసు బలగాలు రాత్రింబగళ్లు రాయచోటి పట్టణంలో బందోబస్తు నిర్వహించనున్నాయి. ఇద్దరు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులను తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ పోలీసులు అరెస్టు చేయడంతో అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఒకపక్క రాయచోటి పట్టణంలోని పలు బహిరంగ ప్రదేశాలలో పోలీసులు గస్తీ కాస్తుండగా, మరోపక్క టెర్రరిస్టుల భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అబూబకర్ సిద్ధిక్, మహమ్మద్ అలీ అనే ఇద్దరు టెర్రరిస్టులు బట్టల వ్యాపారం ముసుగులో రాయచోటిలో మకాం వేసి ఇద్దరు కలిసి రాయచోటి ప్రాంతానికి చెందిన మహిళలను వివాహం చేసుకున్నారు. వీరిలో అబూబకర్ సిద్ధిక్ సంతానం లేకపోగా మహమ్మద్ అలీకి సంతానం కలిగి ఉన్నారు. అబూబకర్ సిద్ధిక్ రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉండే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అందులో చిల్లర దుకాణం ఏర్పాటు చేసి అక్కడ నుంచి కార్యకలాపాలు సాగించేవాడు. ఇరుగుపొరుగువారు దుకాణానికి వస్తే తక్కువ రేటుకు ఇచ్చేవాడని ఎవరైనా అప్పు అడిగినా కూడా ఇచ్చేవారని, ఎవరితో ఎక్కువ మాట్లాడే వ్యక్తులు కారని పక్కన నివాసముండేవారు తెలుపుతున్నారు. మహమ్మద్ అలీ రాయచోటి పట్టణంలోని మహబూబ్ బాషా వీధిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని అక్కడ బట్టల షాపు ఏర్పాటు చేసి అక్కడ నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇద్దరు కొన్ని ఏళ్లగా ఉగ్ర కార్యకలాపాలు సాగించినట్లు సమాచారం. ఇద్దరు టెర్రరిస్టులు పేరుకు చిల్లర దుకాణం, బట్టల షాపు నిర్వహిస్తూ స్థానికులను నమ్మబలికించి వారు తమ కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ పోలీసులు ఇద్దరు టెర్రరిస్టులను అరెస్టు చేసి తమిళనాడుకు తరలించడంతో అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు నివాసం ఉన్న ఇండ్ల వద్ద పోలీసులు పహారా కాస్తుండగా, టెర్రరిస్టుల కుటుంబ సభ్యులను, వీరికి ఇండ్లను అద్దెకు ఇచ్చిన యజమానులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతాలలో విచారిస్తున్నారు. కొత్తపల్లిలో టెర్రరిస్ట్ నివాసంలో పోలీసులు తనిఖీలు చేసి పలు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తాను ఉంటున్న ఇంటి పై రెండో అంతస్తు నిర్మాణం చేపట్టాలని ఇంటి యజమానికి అబూబకర్ సిద్ధిక్ భారీ మొత్తంలో నగదు ముట్ట చెప్పినట్లు సమాచారం. ఇద్దరు టెర్రరిస్టులు రాయచోటి పట్టణంలో కొందరికి ఉగ్ర కార్యకలాపాలపై శిక్షణ ఇచ్చినట్లు రాయచోటి ప్రాంతంలో జోరుగా ప్రచారం సాగుతుంది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఉగ్ర కార్యకలాపాలు కొనసాగుతున్న అనుమానంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చాలా ఏళ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్నా ఉగ్రవాదులను రాయచోటిలో ఉన్నట్లు తమిళనాడు పోలీసులకు సమాచారం అందడంతో నలుగురు ఓ గ్రూపుగా ఏర్పడి నెల రోజుల నుంచి రాయచోటిలో నిఘా ఉంచారు. సమోసాలు, ఐస్క్రీం, కూరగాయలు అమ్మేవారిగా నటిస్తూ ఉగ్రవాదుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. పక్కా సమాచారంతో జూన్ 30న కొత్తపల్లెలో వారిని అరెస్టు చేశారు.



రాయచోటి పట్టణంలో మోహరించిన పోలీసులు



ఉగ్రవాది అబూబకర్ సిద్ధిక్ ఇంటి వద్ద పోలీసులు

డెంగీ నియంత్రణకు చర్యలు : డిఎంహెచ్ఒ



డెంగీ మాసోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ నియంత్రణ సాధ్యమవుతుందని, నివారణకు పకడ్బందీ చర్యలుచేపడుతున్నామని డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ నరసయ్య అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మదనపల్లె అర్బన్ పరిధిలోని త్యాగరాజవీధి, దొంతివీధి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్యాధికారులు జిలాన్, సాల్మన్‌లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం డెంగీ వ్యతిరేక మాసోత్సవాల బ్యానర్‌ను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం ఫ్రైడ్-డ్రైడే పాటించాలన్నారు. దోమతెరలు వాడాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని సూచించారు. జ్వరాలు వస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయించుకోలన్నారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ అభియాన్ కార్యక్రమం అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో యుపిహెచ్‌సి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ఖలీల్, సూపర్‌వైజర్ మహి, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్, డిఇఒ భాస్కర్, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు: దోమల నివారణతోనే ప్రజారోగ్యానికి చక్కటి మార్గమని జిల్లా మలేరియా నియంత్రణాధికారి ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నివాస ప్రాంతాలు, పరిసరాల్లో డెంగీ వ్యాధులకు కారణమయ్యే టైగర్ దోమ తన సంతతిని ఉత్పత్తి చేసుకునేందుకు వినియోగించే నీటి నిల్వలను శుభ్రం చేయడంతో పాటు తాజా నీటి నిల్వలపై మూతలు పెట్టాలని పేర్కొన్నారు. దోమల నియంత్రణలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేసి, వ్యాధుల రహిత పీలేరును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం 'దోమల అంతం మనందరి పంతం' అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, ప్రధానోపాధ్యాయులు శివశంకర్, డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసులు, పర్యవేక్షకులు కుసుమ, రెడ్డెప్ప, ఎఎన్ఎంలు భార్గవి, లక్ష్మీ, చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి-రాయచోటి

శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 6, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 3, రాయచోటిలో 3, బద్వేల్‌లో 3, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూర్, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మరింత సమాచారానికి 08562 258622, 244622 ఫోన్ నెంబర్లు కానీ, ఈమెయిల్ అడ్రస్: kadapa.dcourts.gov.indlsa kdp @gmail.com, కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలన్నారు.

పీలేరు: న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పీలేరు ఇన్‌ఛార్జి 11వ ఆదనపు జిల్లా జడ్జి పివిఎస్ సూర్య నారాయణ మూర్తి తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రెండు బెంచులు ఏర్పాటు చేస్తున్నామని, మొదటి బెంచ్‌లో చిత్తూరు పోక్సోకోర్టు జడ్జి ఎం.శంకర్రావు, రెండవ బెంచ్‌లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాసు నిర్వహిస్తారని పేర్కొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి

- ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య

ప్రజాశక్తి-రాయచోటి

ఎపిఎస్ ఆర్‌టిసిని 2020లో గత ప్రభుత్వం విలీనం చేసిన అనంతరం వివిధ కారణాలతో ఆరేళ్లుగా ఉద్యోగులు ఉద్యోగోన్నతలకు నోచుకోకుండా ఎదురుచూస్తూ పదవి విరమణ అయిపోతుందని, ఆఫీసులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం బస్టాండ్ అవరణంలోని డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉద్యోగోన్నతలపై ఆర్‌టిసి ఉద్యోగసంఘాలుగా చేస్తున్న ప్రయత్నాలు మేరకు ఆర్‌టిసి సిఎండి ద్వారకా తిరుమలరావు ప్రభుత్వ అనుమతి కోరుతూ కేసును పంపి పదినెలలు గడుస్తున్నా మోక్షం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ఉద్యోగోన్నతల అనుమతులు వచ్చాయిగాని, కింది స్థాయిలోని వారు మూడు వేల మంది ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. 11వ పిఆర్‌సికి సంబంధించిన 24 నెలలు బకాయిలు, పెండింగు డిఎ బకాయిలు చెల్లించాలని తదితర 30 డిమాండ్లతో జులై 4, 5వ తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా 129 డిపోలలో, నాలుగు వర్క్‌షాపులలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ విరామం సమయంలో ధర్నాలు, గేట్ మీటింగులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టాలనుకుంటున్న విద్యుత్ బస్సులను స్వాగతిస్తున్నామని, ఆ బస్సులన్నీ ప్రయివేటు ఆపరేటర్స్‌తో కాకుండా ఆర్‌టిసి ద్వారా నిర్వహించాలని, ప్రస్తుతం ఆర్‌టిసిలో ఉన్న సుమారు 10 వేలు ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రభుత్వం కల్పించేలోపే కనీసం 3 వేలు కొత్తబస్సులు వెంటనే కొనాలని డిమాండ్ చేసారు. ఆర్‌టిసిలో రిటైర్డు ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాడ్యూటీ, లీవ్ ఎన్‌క్యాస్‌మెంట్లు సంవత్సరాలు గడుస్తున్నా సరే చెల్లింపులు లేనందున ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నందున చెల్లింపులు జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు నాగభూషణంరెడ్డి, జిల్లా అధ్యక్షులు సి.ఆనందబాబు, జిల్లా కోశాధికారి కొండా ఈశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పి.శరత్ బాబు, రాయచోటి డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎ.సమద్, జి.ఎం.రెడ్డి, గ్యారేజీ కార్యదర్శి మనోజ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని అన్ని పశు వైద్యశాలలో రేబిస్ వ్యాధి టీకాలు వేయు కార్యక్రమం జరుగుతోందని పశు సహాయ సంచాలకులు డాక్టర్ కె.వెంకటమునినాయుడు తెలిపారు. ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని పాలెం, మేడపల్లి, మహల్, కలికిరి వైద్యశాలలలో పెంపుడు కుక్కలకు రాబిస్ టీకాలు పంపిణీ చేస్తున్నామని దాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతకమైన వ్యాధులలో పిచ్చి కుక్క కాటువ్యాధి ముఖ్యమైందని అన్నారు. ఈ వ్యాధికి నివారణ తప్ప చికిత్స లేదన్నారు. మండలంలోని అన్ని పశువైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు, పిల్లులకు ఈ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ప్రాంతీయ పశు వైద్యశాల కలికిరిలో ఉదయం 10 గంటలకు టీకాలు వేయడంతో పాటు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ సహకార సంవత్సరంగా 2025కు గుర్తింపు

ప్రజాశక్తి-కలకడ: ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిందని కలకడ పిఎసిఎస్ పిఎసి అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గయ్య పేర్కొన్నారు. మండలంలోని బాటవారిపల్లి జడ్‌పి హైస్కూల్(బాలుర)లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలకడ పిఎసిఎస్ పిఎసిబి దుర్గయ్య అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గయ్య మాట్లాడుతూ 2025వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిందని సహకార సంఘాలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి అనే నినాదాన్ని ఈ సహకార సంవత్సరానికి ప్రకటించిందని చెప్పారు.సహకార సంఘాలు రైతులకు ఏ విధంగా రుణాలు అందిస్తాయో వివరించి చెప్పారు. కార్యక్రమంలో కలకడ, కలికిరి సహకార సంఘము సిఇఒలు ఎస్.నాగేంద్రబాబు , సహకార సంఘం సిఇఒ కొండప్ప, సిఇఒ నాగార్జున, వెంకటేష్ సంఘ సిబ్బంది మల్లికార్జున, చౌడయ్య, గౌస్ మొహిద్దీన్, పాఠశాల ప్రధాన పాధ్యాయులు, వెంకటాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

సమాజసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఎంవీ ఆనందన్ అని పలువురు కితాబిచ్చారు. శుక్రవారం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ కవితారాణి మాట్లాడుతూ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అనే మహావృక్షాన్ని స్థాపించిన ఆనందన్ మానవతా దృక్పథంతో, మంచి ఆలోచనతో, వెలుగుతో.. ఆదరణే.. వెలిగించు అనే నినాదంతో 2002లో సంస్థను స్థాపించి గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఆరోగ్యం పర్యావరణ కార్యక్రమాలు చేపట్టారన్నారు. 2009 జనవరి 17వ తేదీన చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి ఐదుమంది పిల్లలతో మొదలైన ఈ ప్రస్థానం అంచలంచెలుగా పెరిగి వట వృక్షమైందన్నారు. కార్యక్రమంలో సంస్థ అడ్మిన్ డైరెక్టర్ విక్రమ్‌సింహబాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణవేణి, ట్రెజరర్ పద్మం గిరిజమ్మల్,ఉపాధ్యాయులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

అవగాహన రాహిత్యంతోనే ఆరోపణలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆర్యవైశ్య సంఘం మీద అవగాహన రాహిత్యం తోనే కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు గునిశెట్టి రమేష్, చలపతి హరినాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ ఆర్యవైశ్య సంఘం సమావేశమై సంఘంపై కొందరు సభ్యులు చేసిన ఆరోపణలు అవగాహన లోపంతో చేసినవని కమిటీ వారు తీర్మానం ఆమోదించారు. సంవత్సరానికి రెండు మార్లు గ్రామంలోని వైశ్యులందరికీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి జమా ఖర్చుల గురించి నిర్మాణాల గురించి తెలియ జేస్తా రని అన్నారు. సంఘం వారు ప్రతినెలలో జరుగు సమావేశాల్లో జమా ఖర్చులు తెలియజేస్తారని, ఆలయ నిర్మాణం,ఉత్సవ మండపం,నిధుల గురించి, ఆరోపణలు చేసిన వారికి ఎలాంటి అవగాహన లేదని అన్నారు. సభ్యులకి ఏమైనా సందేహం ఉంటే దేవస్థానం వద్దకు వచ్చి జమా ఖర్చు పద్దులు చూసుకొని వచ్చునని చెప్పారు. ఆరోపణలు చేసేవారు పూర్తి అవగాహనతో కలిగి నడుచుకోవాల్సిందిగా వారు కోరారు. ఈ సమావేశంలో గౌరవ సలహా మండలి అధ్యక్షులు నరసింహులు, సుందరరాజ, మాజీ అధ్యక్షులుపార్థసారథి పాల్గొన్నారు.

కలిసికట్టుగా వ్యాపారాలను అభివృద్ధి చేసుకుందాం

- రాయచోటి వ్యాపార సంఘాల ఐక్య వేదిక నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కలిసికట్టుగా వ్యాపారాలను అభివృద్ధి చేసుకుందాం అంటూ రాయచోటి వ్యాపార సంఘాల ఐక్యవేదిక కార్యక్రమాన్ని చిత్తూరు రోడ్డులోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపార సంఘాల నాయకులు మాట్లాడుతూ మన రాయచోటి మన వ్యాపారం అనే నినాదంతో ముందుకెళ్లాలని ప్రస్తుతం వ్యాపారాలు చాలా తక్కువ ఉన్నందున చాలామంది వ్యాపారస్తులు తమ దుకాణాలకు బాడుగలు కూడా కట్టే పరిస్థితిలో లేవన్నారు. స్థానిక వ్యాపారస్తుల కు సహకరించి ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. వ్యాపాం స్తులంతా ఐక్యమత్యంగా ఉంటే ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరిం చుకోవచ్చని అన్నారు. షాపింగ్ మాల్స్‌లో వ్యాపారాలు తగ్గించి చిన్న వ్యాపార స్తులకు సహకారాలు అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రస్తుతం పట్ట ణంలో జరిగిన సంఘటన దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారస్తులతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్ర మంలో రెడీమేడ్ క్లాత్ అసోస యేషన్ అధ్యక్షుడు విజయ్, జువెలరీ షాప్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఇర్షాద్ అహ్మద్ ఖాన్, పాదాచార అసోసియేషన్ అధ్యక్షుడు హరి, హార్డ్‌వేర్ పెయింట్ ఎలక్ట్రికల్ ఫర్నిచర్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఫ్యాన్సీ స్టోర్స్ టైల్స్ అండ్ గ్రానైట్, ఐరన్ మార్ట్, మొబైల్స్ గ్రసరి, టైర్స్, బ్యాటరీస్, టూ వీలర్ షోరూమ్స్ కార్యక్రమా నిర్వాహకులు సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ అమిర్‌అలీ, ప్రధాన కార్యదర్శి ఆఫ్తాబ్, మొగల్ ఇలియాస్ బేగ్, జిలాన్, ప్రవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ అస్లాం, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న వ్యాపారస్తులు

మదనపల్లె పురపాలక సంఘము

ఈ-ప్రొక్యూర్మెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.553/F1/2020 — తేది: 04.07.2025

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకు గాను ఈ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం	నిధులు	టెండర్ ఐ.డి.లు	పనుల సంఖ్య	పని అంచనాల మొత్తము
1	పురపాలక సాధారణ నిధులు	826139, 826162, 826171, 826178, 826183	5	రూ. 21,00,000/-
2		826187	1	రూ. 4,22,400/-

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి e Procurment market place నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

వరుస నెం. 1
బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 04.07.2025 : 4.00 PM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 11.07.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 11.07.2025 : 11.15 AM

వరుస నెం. 2
బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 04.07.2025 : 4.00 PM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 19.07.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 19.07.2025 : 11.15 AM

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దపరచుటకు/నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

కమీషనరు
మదనపల్లె పురపాలక సంఘము.

స్వరాజ్య సంగ్రామంలో అల్లూరి మహోజ్వల శక్తి

- డిఆర్ఒ మధుసూదన్‌రావు



రాయచోటి : అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

స్వరాజ్య సంగ్రామ చరిత్రలో అల్లూరి సీతా రామారాజు ఒక మహో జ్వలశక్తి అని, అటు వంటి మన్యం వీరుడిని యువత ఆద ర్శంగా తీసు కోవాలని డిఆర్ఒ మధు సూదన్‌రావు పేర్కొన్నారు. శుక్రవా రం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో యువ జన సర్వీసులశాఖ, స్టెప్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లా డుతూ మన్యం వీరుడు అల్లూరి స్వా తంత్ర్యం కోసం ప్రాణాలను తృణ ప్రా యంగా త్యాగం చేసిన మహనీయుడని కొని యాడా రు. ఇతడు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అన్నా రు. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులకు అండగా నిలిచి బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడని, ఆయన చూపిన ధైర్యం తెగువ భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్ర మంలో యువజన సర్వీసుల శాఖ సిఇఒ సాయిగ్రేస్‌లీ, మేనేజర్ వివి సుబ్బరాయుడు, డిఇఒ సుబ్రహ్మణ్యం ఎపి టూరిజం అధికారి నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ముందుకు వెళ్తామని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్రాజు తెలిపారు. అండ్‌బి బంగ్లా వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి టిడిపి శ్రేణులతో కలిసి ఆయన పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ దోపిడీదారుల కబంధ హస్తాల నుంచి ప్రజలను రక్షించేందుకు, దేశ స్వతంత్ర వికాసానికి పోరా డుతూ ఎదురు నిలిచిన దేశ భక్తుడు అల్లూరి అని, ఆయన అడుగు జాడల్లో నడుస్తూ సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శరత్ కుమార్ రాజు, విశ్వనాథ్‌రాజు, సుబ్రహ్మణ్యం రాజు, సతీష్ రాజు, శివరామరాజు, సూర్యనారాయణరాజు, సురేంద్ర, మేడికొండ రవి, కళాధర్, వెంకటేశ్వర నాయుడు, పరుశురాంనాయుడు, తేజల ఆనంద్, శంకర్రాజు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కుడా చైర్మన్, టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, క్షత్రియ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగారాజు రవి కుమార్ రాజు, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు, గడ్డం చంగల్‌రాజు, కె.రామరాజు, జయప్రకాష్ నారాయణ వర్మ, టిడిపి సీనియర్ నాయకులు సూరపరాజు సుబ్బరాజు, డి.కృష్ణంరాజు, జనసేన నాయకులు నాగేంద్ర పగడాల చంద్రశేఖర్, వెంకటేష్ గజేంద్ర రాజు, ఎస్.చంద్రశే ఖర్‌రాజు పాల్గొన్నారు. **వైసిపి ఆధ్వర్యంలో..** అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోటశి వసాయి, వైసిపి జిల్లా యూత్ అధ్యక్షులు యలగచెర్ల శివారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సర్పంచులు దార్ల చంద్రశేఖర్, రమణ, సుబ్రహ్మణ్యంరాజు, రామకృష్ణ నివాళులు అర్పించారు. యువతను అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించండి : ఎంపిడిఒ



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు


ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపదను సృష్టించాలని ఎంపిడిఒ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని రెడ్డి వారిపల్లె, బండ్లపై, తవళం, కొండయ్యగారిపల్లె పంచాయితీలలో పర్యటించి ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని, డంపింగ్ యార్డ్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతిరోజు ఉదయం పారిశుధ్య కార్మికులు తమ గ్రామంలో ఉన్న ఒక పల్లెలోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడి పొడి చెత్తను వేరు చేయాలన్నారు. సేకరించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ ఎరువులను తయారు చేసి తిరిగి రైతులకు విక్రయించి పంచాయతీకి తద్వారా ఆదాయాన్ని సృష్టించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు ఫోటోలు తీసి ఆన్‌లైన్ పొందుపరచాలని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛతాహి సేవ లక్ష్యానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు చేపడతామని అన్నారు. పారిశుధ్య కార్మికులు తరచూ మురుగనీటి కాలువలను శుభ్రం చేయాలన్నారు. సర్పంచులు వారి గ్రామాలలో పారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతిరోజూ తాగునీటిని అందించేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పక పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు గాయత్రి, సరస్వతి, గౌతమి, రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అందరి సమన్వయంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందాని ఎంపిడిఒ కృష్ణవేణి పేర్కొన్నారు. సమస్యల పరిష్కారమే ఎజెండాగా శుక్రవారం మండలం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిపి లక్ష్మీ నరసమ్మ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోనూ ఇంజినీర్లు కానీ, ఇతర అధికారులుగాని పనితీరు సరిలేదని, ఎప్పుడు వెళ్లి పరిశీలించిన ఫీల్డ్ మీద ఉంటామని చెబుతారు కానీ, ఆ ఫీల్డ్ ఎక్కడికి వెళ్తారో తెలియడం లేదన్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని తెలిపారు. తహశీల్దార్ బాబాజాన్ మాట్లాడుతూ రైతులకు రీ సర్వేలో భాగంగా ఒక సర్వే నెంబర్లు 15 ఎకరాలు భూమి ఉందనుకో అదే నెంబర్లో జాయింట్ భాగాలు ఉంటాయని, ఆ జాయింట్ భాగాలకి ఒకటే ఎల్‌సి నెంబర్లు ఉండడంతో ఆ నెంబర్‌లో ఉన్నవారు అందరికీ 15 ఎకరాలు ఉన్నట్లు చూపించడంతో ప్రభుత్వ పథకాలకి కొందరు దూరమవుతున్నారని అన్నారు. భూ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. అందుకుగాను రీసర్వేలో ఒకే నెంబర్లో జాయింట్ నెంబర్లు ఉన్నవారు అందరూ వచ్చి రీ సర్వే చేయించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. వైస్ ఎంపిపి ఖాదర్ వలి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా గోకులషెడ్లకు నిర్మించుకునేందుకు అర్హతలు ఉన్న చాలామంది నమోదు చేసుకున్న కూటమి నాయకులు వారికి కావాల్సినవారి పేర్లు నమోదు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా కూటమి నాయకులు ఐదుగురు వస్తున్నారని, ఇది గ్రామీణ ప్రాంతానికి సంబంధించిన సర్వసభ సమావేశం కాబట్టి అర్బన్‌కు చెందిన వారిని కాకుండా గ్రామీణ ప్రాంతానికి చెందిన వారినే నియమిస్తే బాగుంటుందని అన్నారు. కూటమికి చెందిన ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన బిజెపి నాయకులకు సర్వసభ్య సమావేశంపై అవగాహన లేకపోవడంతో సమావేశంలో అధికారులు చెబుతున్న దానిపై ప్రశ్నలు అడుగుతుంటే అధి కారులకు వారు అడుగుతున్నది అర్థం కాక సమావేశం ఆలస్యవుతూ వచ్చి ంది. ఎంపిడిఒ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒక్కసారి నిర్వ హించే మండల సర్వసభ్య సమావేశానికి వచ్చినప్పుడు ప్రతి శాఖకు చెందిన అధికారులు మూడు రోజులు ముందే నివేదిక సమర్పించాలని తెలి పారు. ఈ సమావేశంలో ఎంఇఒ రెడ్డిశేఖర్, హౌసింగ్ ఎఇ లావణ్య, ఎంపిటిసిలు సుబ్బయ్యనాయుడు, రామసుబ్బారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. **నందలూరు:** మండల అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చెయ్యాలని మండల అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.స్థానిక ఎంపిడిఒ



నందలూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ రాధాకృష్ణన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధి కొరకు ప్రతి అధికారి, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మోహన్, వైస్ ఎంపిపిలు నాయనపల్లి అనుదీప్, తుమ్మల భావన, ఎంపిటిసిలు సోమిశెట్టి సునీత, కసిరెడ్డి రమేష్‌రెడ్డి, పునగాని వెంకటసుబ్బమ్మ, సుభాన్‌బాషా, స్రవంతి, సుబ్బమ్మ, సర్పంచులు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు. **గుర్రంకొండ :** మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులపై ఎంపిటిసిలు ఖదీర్, రాజగోపాల్ ఆగ్రహం వ్యకతం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సీతమ్మ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపిటిసిలు మాట్లాడుతూ మండలంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల భూమి లో విల్ట్ వ్యాధి నివారణకు అందిస్తున్న ట్రైకోడెర్మా విరిడి మందులు అందించడంలో నిర్లక్ష్యం చేశారని మండలంలో చాలా రైతులు నష్టపోయారని విల్ట్ రోగాన్ని నివారించుకోకుండా రైతులు ఇబ్బంది పడ్డారని అన్నారు. వీటికి కారణం గుర్రంకొండ వ్యవసాయ అధికారులేనని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధర వెయ్యి రూపాయల వరకు పలుకుతున్న రైతులు నిరాశ నే మిగిల్చాయని సభ దృష్టికి తీసుకువచ్చారు.హార్టికల్చర్, వెటర్నరీ సిరికల్చర్, ఆర్‌టిసి, మరికొన్ని శాఖల అధికారులు గైరహాజరు కావడంతో ఎంపిటిసి మండిపడ్డారు సమావేశానికి అధికారుల రాకపోతే సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎవరు ఇస్తారని ప్రశ్నించారు.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సుపరి పాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని రూరల్ పరిధిలోని కట్టావారిపల్లిలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతు న్నాయా లేదా అని అడిగి తెలుసు కున్నారు. అనంతరం తాగునీటి బోరు ను కూడా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షే మం తో పాటు అభివృద్ధిని కూడా సమపాళ్లల్లో చూసుకోవడం కూటమి ప్రభుత్వం గొప్పతనమని అన్నారు. అలాగే చేపడుతున్న పథకాలు ప్రజలకు మేలు చేసేందుకే అని, గత ప్రభుత్వం లాగా ఊరిలో తాగునీరు లేకపోయినా మద్యం జోరుగా పారించి దోచుకు తిన్నారని ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి ఏడాది సందర్భంగా ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లి ప్రస్తుతం అందుతున్న పాలన గురించి, భవిష్యత్తులో కావలసిన పథకాల గురించి వివరిస్తున్నామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తాము పడుతున్న నీటి కష్టాలు తీర్చిన చమర్తి జగన్ మోహన్ రాజుకు కట్టావారిపల్లి ప్రజలు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమస్యను తెలుసుకొని వెంటనే బోరు వేయించి నీటి సమస్య తీర్చినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నేరు సుబ్బ నరసయ్యనాయుడు, సీనియర్ నాయకులు పారా సుబ్బా నాయుడు, బాపనయ్యనాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, పోలిచెరువు ప్రెసిడెంట్ నాగినేని నాగేశ్వర్ నాయుడు, దివాకర్ నాయుడు, మేడికొండు రవి, కే.సతీష్, సర్పంచ్ హరి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ టెక్సమో మల్లికార్జున నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రామపురం :** దేశంలోనే సంక్షేమ పథకాలకు ఆజ్యం పోసిన పార్టీ టిడిపినేనని ఐటిడిపి ఛాంపియన్ నాగభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ 60 పోలింగ్ బూత్ పరిధిలో గురువారం సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగిరెడ్డి లక్ష్మిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి మదన వేణుగోపాల్, కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. **పుల్లంపేట:** రాష్ట్రంలో సుపరిపాలన అభివృద్ధిలో గ్రామాలలో తెలుగుదేశం కార్యకర్తలను నాయకులు కలుపుకొని గడపగడపకు తొలి అడుగులు వేస్తున్నట్లు రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి గ్రామంలో కార్యక్రమం ప్రారంభమై నంతరం పివిజిపల్లె పంచాయతీలోని రామసముద్రం, యువి అగ్రహారం, కోనియ్యగారిపల్లి, కొత్తపేట, రాచపల్లి, దండ్లపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఆయన వెంట తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపాలన వచ్చి ఏడాది అవుతుందని అనుకున్నట్లు ఆయన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ఎస్‌ఐ శివకుమార్, లింగుట్ల వెంకటరమణ, పసుపులేటి వెంకట రమణ, పల్లపు జనార్ధన, కృష్ణమ నాయుడు పాల్గొన్నారు.



రాజంపేట : తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు



వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దమాలపల్లిలో వైద్య శిబిరం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని అరవీడు పంచాయతీ, పెద్ద మాలపల్లిలో విష జ్వరాలపై శుక్రవారంలో ప్రజాశక్తి దినపత్రికలో 'పెద్ద మాలపల్లిలో విజృంభిస్తున్న విష జ్వరాలు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి వైద్యాధికారులు స్పందించారు. రాయచోటి సబ్ యూనిట్ అధికారి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామానికి సందర్శించి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటి వెళ్లి జ్వరాల బారిన పడిన వివరాలు తెలుసుకొని మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారిని ఉన్నతాసుపత్రికి రావాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటితో పాటు పరిస రాలను శుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. దోమలు విజృంభచకుండా నీటి తొట్టెలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఎయిర్‌కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల నివారణకు దోమ తెరలను వాడాలని సూచించారు. అనంతరం గ్రామంలో దోమ లార్వా సర్వే చేశారు. నీరు నిలువుండచోట బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాల పరిశుభ్రత పైన ప్రజలకు అవగాహన కల్పించారు.

మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి-కలకడ : మండలంలో మొహరం పండుగ వేడుకలను ప్రశాంత వాతావర ణంలో జరుపుకోవాలని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు మండలంలో పలు గ్రామాలలో నిర్వహించే మొహరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామ పెద్దలు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్తేజభరితంగా జరుపుకునే ఈ వేడుకలలో అల్లర్లకు తావుండ రాదన్నారు అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. మండలంలో మొహరం పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిసే విధంగా సహకరించాలని ఎస్‌పి ఆదేశించినట్లు తెలిపారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని గోపగుడిపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగుల సేవలు మరువలేనివని గ్రామ సర్పంచ్ ముంగర సరోజమ్మ, గ్రామ నాయకుడు ముంగర సుబ్బయ్య పేర్కొన్నారు. గోపగుడిపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది బదిలీపై వెళ్లడంతో వారిని సర్పంచ్ సరోజమ్మ, గ్రామ నాయకులు, ప్రజలు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివా లయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి తమ గ్రామంలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించిన సిబ్బంది బదిలీపై వెళ్తుంటే కొద్దిగా బాధగా ఉన్నా ఉద్యోగస్తులకు బదిలీలు సర్వసాధారణమేనని అన్నారు. ఎక్కడ పనిచేసినా మంచి పేరు సంపాదిం చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, బలరా మయ్య, వెంకటరా మరాజు, రామానుజులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు మల్లెల గ్రామంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దతిప్పసముద్రం, మల్లెల పంచాయతీ, ఉపరోళ్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్; దీర్ఘకాలిక కీళ్లు, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించబడునున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించబడు నున్నారు. ముఖ్యంగా ఇసిజి, ఎకో, ముందస్తుగా కేన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయబడునన్నారు .ఈ అవకాశాన్ని మండల, నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 ,9177145294, నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సిఎం విసిలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన బాషా పాల్గొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూఫ్, ఎపిఎస పిడిసిఎల్ డిఇ, ఎంపిడిఒ తాజ్ మాస్రూర్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల పలువురు అధికారులు హాజరయ్యారు. విధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

క్రైం కార్నర్

రెండు కార్లు ఢీ : మహిళకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ పరిధిలోనే నర్సరీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని లక్ష్మీ ప్రసన్న అనే మహిళకు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరి చెందిన స్వామి కారులో కనిగిరి నుంచి రాయవరం వస్తుండగా మార్గమధ్యంలో రాగానే రామాపురం మండలం నల్లగుట్టపల్లి నర్సరీ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళకు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం108 వాహనంలో రాయచోటి ప్రభువు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కొండయ్యగారిపల్లి పంచాయతీ కొండయ్యగారిపల్లి సమీపంలో ఎనిమిది మంది వ్యక్తులు కలిసి పేక ముక్కలతో జూదం ఆడుతూ ఉండగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,600లు నగదును స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అసాం ఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరిం చారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ కొండయ్యగారిపల్లెకు సమీపంలో పఠాన్‌మజీద్ కుమారుడు అల్లాబక్షు అనే వ్యక్తి నాటు సారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. శుక్రవారం నాటు సారా విక్రయ స్థావరం పై పోలీసులు దాడి చేసి అల్లాబక్షు ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.